నమస్తే తెలంగాణ
# జిందగీ
బుధవారం | 16 ఏప్రిల్ 2025
హైదరాబాద్ | www.ntnews.com




'చల్లగా తొలివాన నాపైన కురిసింది' అంటూ మతలా (పల్లవి) అందుకున్నదామె. ఆ సభలో ఆసీనుడైన సినారె 'చిరుజల్లు చల్లగా నా మనసు తడిసింది' అన్నట్టుగా తన్మయుడయ్యాడు. ఆయన ప్రశంసలే ప్రేరణగా గజల్ ఆలాపన మొదలుపెట్టింది హిమజా రామం. 'బలిదానపు తంగేడై పూసిందిలే తెలంగాణ' అంటూ మొదలుపెట్టి ప్రతి శేర్ (తెలుగులో ద్విపద వంటిది)లో అమరుల్ని స్మరించిన ఆ పాటకు తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కవితక్క ఫిదా అయిపోయారు. ప్రతి వేదికపైనా నీ పాటుంటుందని మాటిచ్చినట్టే తెలంగాణ ఉత్సవాల్లో హిమజ గళం వినిపిస్తున్నది. ప్రతి గజల్‌కూ తఖల్లుస్ (కవి నామముద్ర) ఉన్నట్టే ఆలాపనలో లలిత సంగీత బాణి ఆమె శైలి!

# గజల్ వేదికపై లలిత రాగం!

కవయిత్రి ఇందిర బైరి బిడ్డను నేను. అమ్మ మొదట్లో కవితలు, మినీ కవితలు, నానీలు రాసేది. హైదరాబాద్ వచ్చాక తనకు 'గజల్' ప్రక్రియ పరిచయమైంది. గజల్స్ రాయడం నేర్చుకుంది. అనేక అంశాలతో గజల్స్ రాసింది. ఎనిమిదేళ్ల క్రితం అమ్మ రాసిన గజల్ కావ్యం 'తెలంగాణ' ఆవిష్కరణ జరిగింది. సినారె గారు వస్తున్నారని ఆ కార్యక్రమానికి వెళ్లాను. ఆ సభలో నన్ను అమ్మ రాసిన ఒక గజల్ పాడమన్నారు. అంతకుముందు దేశభక్తి గీతాలు పాడాను. కర్ణాటక సంగీతం నేర్చుకున్నాను కాబట్టి 'చల్లగా తొలి వాన నా పైన కురిసింది... చిరుజల్లు చల్లగా నా మనసు తడిసింది' అలవోకగా పాడాను. 'చాలా చక్కగా పాడిందని' ఆ సభలో సినారె గారు ప్రశంసించారు. సభ తర్వాత ప్రత్యేకంగా అభినందించారు. 'నువ్వు తెలుగు గజల్స్ పాడొచ్చు. మంచి భవిష్యత్ ఉంటుంది. నేను రాసినవీ ఆలపించు' అన్నారు.

కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాలలో చదివేటప్పుడు సంగీతం టీచర్ తాడేపల్లి వెంకట పద్మావతి గారి దగ్గర సంగీతంలో బేసిక్స్ నేర్చుకున్నాను. లైట్ మ్యూజిక్‌లో యాభై దాకా దేశభక్తి గీతాలు నేర్పించారు. ఇంటర్, డిగ్రీ చదివే రోజుల్లో కాలేజీ పోటీల్లో చాలా బహుమతులూ గెలిచాను. సినారె గారి ప్రశంసలు ప్రేరణనిచ్చాయి. అప్పటినుంచి గజల్స్ పాడాలని నిశ్చయించుకున్నాను.

## పండితుల తిట్లు.. పామరుల ప్రశంసలు!

గజల్ ఆలాపనకు వేదికలు తక్కువ. సాంస్కృతిక సంస్థలే అవకాశం ఇస్తాయి. వాటిని పాడినప్పుడు ప్రశంసల కంటే విమర్శలే ఎక్కువగా ఉండేవి. అమ్మ, చెట్టు, ఊరు, తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వస్తువులుగా ఉన్నవి పాడినందుకు 'ఇవి గజళ్లా?' అని నోరు పారేసుకునేవాళ్లు. చాలామంది విమర్శించారు. 'ప్రేమ, విరహం అంశాలే పాడాలి. అన్ని అంశాలూ ఎలా పాడతారు?' అని ప్రశ్నించేవాళ్లు. సోషల్ మీడియాలో తిట్లు, విమర్శలు వచ్చేవి. 'గజల్' అంటే ప్రియురాలితో సంభాషణ. సినారె గారు దానిని ప్రేమ, విరహం దాటించి కొత్త దారిలో నడిపించారు. తెలుగులో సామాజిక అంశాలను వస్తువులుగా తీసుకుని ప్రయోగం చేశారు. అమ్మ, భాష, తత్వం.. ఇలా ఎన్నో సామాజికాంశాలను కవితా వస్తువులుగా ఎంచుకుని గజల్స్ రాశారు. దానిని ఎంతో మంది కవులు అనుసరించారు. ఆ దారిలో నడుస్తున్నాను. పండితులు, కవులు విమర్శించారు. కానీ, సామాన్యులు మాత్రం 'భలేగా పాడుతున్నార'ని ఆదరించారు. ప్రేక్షకాదరణ ఉండబట్టే మాకు ఇంకా వేదికలు దొరుకుతున్నాయి.



## గజల్స్ లలితంగా

లలిత సంగీతం బాణిలో గజల్ ఆలపించడం నా శైలి. హిందుస్థానీ సంగీత పద్ధతిలో రాగాలాపనకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే సాహిత్యం తేలిపోతుంది. గజల్ అనేది సాహిత్యం ప్రధానంగా ఉండే గాన ప్రక్రియ. అందుకే లలిత గీతాల్లా పాడటం బాగుంటుంది అనిపించింది. పాడే గజల్ 'ఎప్పుడు రాశారు? ఎందుకు రాశారు?' తెలుసుకుని ఆ భావాన్ని రాగాలలోకి తీసుకువస్తాను. లలిత సంగీతంలో భావ వ్యక్తీకరణ ముఖ్యమైనది. అందుకే శ్రోతలు 'వహ్వా వహ్వా' అంటున్నారు. తొమ్మిదేళ్లుగా 200కు పైగా వేదికలపై ఆలపించాను. ఈ ప్రయాణంలో నన్ను నేను మెరుగుపర్చుకుంటూనే ఉన్నాను. కర్ణాటక సంగీతం ఎక్కడ ఆపానో.. మళ్లీ అక్కణ్నుంచి మొదలుపెట్టాను. ఓవైపు సంసార బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. పెండ్లయిన పదేండ్ల తర్వాత తెలుగు విశ్వవిద్యాలయంలో లైట్ మ్యూజిక్ డిప్లొమా కోర్సులో చేరి విజయవంతంగా పూర్తిచేశాను.



తల్లి ఇందిరతో..

## తెలంగాణ గజల్

రవీంద్ర భారతిలో నిర్వహించిన కాళోజీ జయంతి ఉత్సవాల్లో గజల్ పాడేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించింది. ఆ వేదికపై అమ్మ రాసిన 'బలిదానపు తంగేడై పూసిందిలే తెలంగాణ... దశాబ్దాల చరిత తిరగరాసిందిలే తెలంగాణ' గజల్ ఆలపించాను. ఆ గజల్ కవితక్కకు బాగా నచ్చింది. అప్పుడు అమ్మ రాసిన గజల్ కావ్యం 'తెలంగాణ' ఆమెకు కానుకగా ఇచ్చాను. అందులోని ప్రతి శేర్‌లో ఒక్కో అమరవీరుడిని కీర్తించింది అమ్మ. తెలంగాణ జాగృతి నిర్వహించే ప్రతి కార్యక్రమంలో గజల్స్ పాడించాలని కవితక్క నిర్ణయించింది. అప్పటినుంచి ఆ సంస్థ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాడుతున్నాను. నాకు ఇష్టమైన అంశాలను వస్తువుగా తీసుకుని గజల్ రాయాలని అడిగి మరీ అమ్మతో రాయించుకున్నాను. నా కోసం చాలా రాసిపెట్టింది. పెన్నా శివరామకృష్ణ, లక్ష్మీ రాయవరపు, శ్రీనివాస్ ఈడూరి, ద్యావరి నరేందర్ రెడ్డి, సుబ్రహ్మణ్య శర్మ మొదలైన వాళ్లను అడిగి గజల్స్ రాయించుకున్నాను. గడ్డం శ్యామల, వడ్డేపల్లి కృష్ణ, దాశరథి రాసినవీ పాడుతున్నాను.

## అమ్మ వైపు నేను... నా వైపు అమ్మ!

నాకు సినారె గారు దైవ సమానులు. ఆయన గజల్స్ ఎన్నో పాడాను. ఇతరుల గజల్స్ కూడా పాడుతున్నాను. సినారె గారు 'అమ్మ ఒక వైపు... దేవతలంతా ఒకవైపు... నేనొరిగేను అమ్మవైపు' అన్నారు. ఎంత హృద్యమైన భావనో కదా! సినారె గారి ప్రోత్సాహంతో గజల్స్ పాడుతున్న నన్ను నలుగురికి తెలిసేలా చేసింది జాగృతి వ్యవస్థాపకులు కవితక్క, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ గారు. 2016 నుంచి తెలంగాణ జాగృతి నిర్వహించే కవి సమ్మేళనాలు, బతుకమ్మ సంబురాలు, కాళోజీ జయంతి ఉత్సవాల్లో ప్రతీసారి పాడటానికి మాకు వేదిక ఇచ్చారు. అమ్మ కాలం చేసిన తర్వాత కవితక్క స్ఫూర్తితోనే గజల్స్ పాడుతున్నాను. అమ్మ రాసిన వాటితో 'తెలంగాణ గజళ్లు' రూపొందించాను. నన్ను ప్రోత్సహించిన కవితక్కే దీనిని ఆవిష్కరించింది. 'సవ్వడి' అనే రెండో ఆల్బమ్ తీసుకువచ్చాను. మూడో ఆల్బమ్ 'వనితాంతరంగం'లో అమ్మ గజళ్లతోపాటు ఇతరులవీ ఉన్నాయి. ఈ ప్రయాణం గజల్స్ అంత మనోహరంగా సాగిపోతుందన్న నమ్మకం ఉంది.

... నాగవర్ధన్ రాయల

# మామిడి బొప్పాయి సలాడ్



### కావలసిన పదార్థాలు

**సన్నగా తరిగిన మామిడి పండు, బొప్పాయి పండు ముక్కలు:** ఒక కప్పు చొప్పున, **పచ్చిమిర్చి:** రెండు, **కొత్తిమీర తురుము:** ఒక టీస్పూన్, **వేయించిన పల్లీలు:** పావు కప్పు, **ఉప్పు:** తగినంత, **ఆలివ్ ఆయిల్:** రెండు టీస్పూన్లు, **మిరియాల పొడి:** పావు టీస్పూన్, **వెల్లుల్లి రెబ్బలు:** నాలుగు, **తెల్ల నువ్వులు:** రెండు టీస్పూన్లు.

### తయారీ విధానం

ఒక గిన్నెలో మామిడి, బొప్పాయి ముక్కల్ని వేసి, చిన్నగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర తురుము, వేయించిన పల్లీలు, తగినంత ఉప్పు, ఆలివ్ ఆయిల్, మిరియాల పొడి, తురిమిన వెల్లుల్లి వేసి బాగా కలపాలి. చివరిగా నువ్వులు వేసి మరోసారి కలుపుకొంటే నోరూరించే మామిడి బొప్పాయి సలాడ్ సిద్ధం.

# కొబ్బరినీళ్లకు తోడుగా..

వేసవితాపాన్ని తీర్చడంలో కొబ్బరినీళ్లు ముందుంటాయి. పొటాషియం, మెగ్నీషియం, సోడియంలాంటి ఎలక్ట్రోలైట్లతోపాటు అనేక పోషకాలతో నిండిన ఈ నీళ్లు.. ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంతోపాటు కండరాలు, నరాల పనితీరుకు మద్దతునిస్తాయి. అలాంటి కొబ్బరినీళ్లకు ఇతర పదార్థాలను జోడించడం ద్వారా మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు సమకూరుతాయి.



**పుదీనా :** కొబ్బరి నీళ్లకు పుదీనాను జోడిస్తే.. అద్భుతమైన రిఫ్రెషింగ్ డ్రింక్ తయారవుతుంది. ఇది శరీరాన్ని చల్లబరచడంతోపాటు జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సమర్థంగా పనిచేస్తుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యను తగ్గిస్తుంది. పుదీనాలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు.. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

**నిమ్మరసం :** విటమిన్ సితోపాటు హైడ్రేషన్‌కు మద్దతునిచ్చే ఎంజైమ్‌లు నిమ్మరసంలో పుష్కలంగా ఉంటాయి. ఆమ్ల స్వభావం కలిగిన నిమ్మరసం, ఆల్కలీన్ కొబ్బరినీళ్లతో కలిసి.. శరీర పీహెచ్‌ను సమతుల్యం చేయడంలో సాయపడుతుంది.

**తేనె :** కొబ్బరినీళ్లకు తేనె కలిపి తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆయుర్వేదం చెబుతున్నది. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు, ఎంజైములు, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కొబ్బరినీటిలోని ఖనిజాలతో కలిసి.. ఇన్ఫెక్షన్లతో పోరాడే శక్తిని శరీరానికి అందిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచి ఆరోగ్యానికి అండగా నిలుస్తాయి.

**చియా విత్తనాలు :** ఫైబర్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభించే చియా విత్తనాలను కొబ్బరినీళ్లలో కలిపితే.. శరీరానికి కావాల్సిన శక్తినిచ్చే పానీయం సిద్ధమవుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. శరీరం ఎక్కువసేపు హైడ్రేటెడ్‌గా ఉండటంలో సహాయపడుతుంది. గుండె, మెదడు ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది.

**నల్ల ఉప్పు :** కొబ్బరినీళ్లలోని పొటాషియం, మెగ్నీషియం.. నల్ల ఉప్పులోని సోడియం, ఐరన్, సల్ఫర్ వంటి ఖనిజాలు కలిసి.. ఎలక్ట్రోలైట్ రిచ్ డ్రింక్‌గా తయారవుతుంది. నల్ల ఉప్పులోని కార్మినేటివ్ లక్షణాలు.. ఆకలిని నిరోధిస్తాయని ఆయుర్వేదం చెబుతున్నది. ఇవి కొబ్బరినీళ్లతో కలిసినప్పుడు జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

# ఇలా చేస్తే.. ఇల్లు శుభ్రం

ఇంటిని శుభ్రంగా ఉంచడానికి ఎంత ప్రయత్నించినా.. 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే!' అన్న చందంగా తయారవుతుంది. రోజంతా కష్టపడి క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చినా.. తెల్లారేసరికి మళ్లీ మొదటికే వస్తుంది. అయితే, కొన్ని చిట్కాలు పాటిస్తే.. ఇల్లు ఇట్టే శుభ్రమై పోతుందని నిపుణులు అంటున్నారు.

**కిటికీ** అద్దాలు, డ్రెస్సింగ్ టేబుల్ మిర్రర్‌ను ఎంత శుభ్రం చేసినా.. మబ్బు పట్టినట్టే కనిపిస్తుంటాయి. వీటిని కాఫీ వడబోసే ఫిల్టర్ క్లాత్‌తోకానీ, ఫిల్టర్ పేపర్‌తో కానీ శుభ్రం చేస్తే.. తళతళా మెరిసిపోతాయి.

**చెక్క** ఫర్నిచర్‌పై నీటి మరకలు వదలగొట్టడం చాలా కష్టం. మొదట్లో శుభ్రపడినట్టే అనిపించినా.. కాసేపయ్యాక అక్కడక్కడా తెల్లగా పేరుకుపోయి ఎబ్బెట్టుగా కనిపిస్తాయి. ఈ మరకలను పోగొట్టడంలో ఆలివ్ నూనె సమర్థంగా పనిచేస్తుంది. ఆలివ్ నూనెలో కొద్దిగా ఉప్పు కలిపి.. పేస్ట్‌గా తయారుచేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని మరకలు ఉన్న చోట అప్లయి చేయాలి. గంట తర్వాత పొడి వస్త్రంతో తుడిచేస్తే.. నీటి మరకలు మాయమై పోతాయి.



**దుస్తులపై** నూనె పడితే.. ఆ మరకలు ఓ పట్టాన వదలవు. బేబీ పౌడర్, డిష్ సోప్ మిశ్రమంతో.. వాటిని ఈజీగా తొలగించొచ్చు. బేబీ పౌడర్ - డిష్ సోప్‌ను సమపాళ్లలో తీసుకొని.. పేస్ట్‌గా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని మరకల మీద కొద్దిగా అప్లయి చేసి.. కాసేపయ్యాక బాగా రుద్ది ఉతికేస్తే.. మంచి ఫలితం కనిపిస్తుంది.

**గాజు** పాత్రలు, గ్లాసులు పగిలి పోయినప్పుడు.. కంటికి కనిపించని ముక్కలు నేలపైనే ఉండిపోతాయి. కాలికి గుచ్చుకొని ఇబ్బంది పెడుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లో బ్రెడ్ స్లయిస్‌తో గ్లాసు పగిలిన ప్రదేశంలో నేలపై అద్దాలి. దాంతో చిన్నచిన్న గాజు ముక్కలు కూడా బ్రెడ్‌కు అతుక్కుపోతాయి.

**పిల్లలు** ఉన్న ఇంట్లో దుస్తులు, రగ్గులు, ఫర్నిచర్.. అన్నిటిమీదా మార్కర్ మరకలు పడుతుంటాయి. ఇలాంటి మార్కర్ మరకలపై కాస్త సన్‌స్క్రీన్ లోషన్ అప్లయి చేసి.. అరగంట తర్వాత పొడిబట్టతో తుడిచేస్తే సరిపోతుంది.

**మైక్రోవేవ్** ఓవెన్‌ను శుభ్రం చేయడం ఓ పెద్ద పని. అందులో పడిపోయే ఆహార పదార్థాల అవశేషాలతో.. లోపలి భాగమంతా జిడ్డుగా తయారవుతుంది. ఒక గిన్నెలో నిమ్మకాయ ముక్కల్ని వేసి.. ఓవెన్‌లో పెట్టేయాలి. అధిక టెంపరేచర్‌లో ఐదు నిమిషాలు ఉంచేయాలి. దీనివల్ల నిమ్మకాయలోని ఆమ్లత్వం.. ఓవెన్‌లోని జిడ్డుదనాన్ని కరిగిస్తుంది. ఆ తర్వాత ఒక తడి గుడ్డతో తుడిచేస్తే సరిపోతుంది.

**కిచెన్** సింక్, వాష్‌బేసిన్‌పై మరకల్ని టూత్‌పేస్ట్ సాయంతో శుభ్రం చేయవచ్చు. మొండి మరకలపై టూత్‌పేస్ట్ రాసి.. అరగంట తర్వాత స్పాంజ్‌తో రుద్ది కడిగేస్తే.. మరకలు సులభంగా వదిలిపోతాయి.

# ఆతిథ్యంలోనూ అత్తెసరే..



**అతిథి** మర్యాదలు చేయడంలో ఆడవాళ్లే ముందుంటారు. ఇంటికి చుట్టాలు వచ్చినా.. స్నేహితులు వచ్చినా ఆత్మీయంగా చూసుకుంటారు. అందుకే.. ఆతిథ్యరంగంలోనూ ఆడవాళ్లే ఆధిపత్యం చెలాయిస్తున్నారు. హాస్పిటాలిటీలో మహిళల వాటా 52 శాతంగా లెక్కతేలింది. అయితే.. నాయకత్వంలో మాత్రం వెనకబడి పోతున్నారు. కేవలం 30 శాతం మంది మాత్రమే కీలక పదవుల్లో ఉంటున్నారట. 'ఎంపవరింగ్ ఉమెన్ ఇన్ హాస్పిటాలిటీ' నిర్వహించిన ఓ సర్వే ఇందుకు సంబంధించిన అనేక విషయాలను వెల్లడించింది. ఆతిథ్య రంగంలో మహిళలు అద్భుతమైన పురోగతి సాధిస్తున్నా.. ఉన్నత స్థాయుల్లో వారికి ఎదురుదెబ్బలే తగులుతున్నాయని ఈ సర్వే పేర్కొంటున్నది. హాస్పిటాలిటీ రంగంలో 2023 వరకు సీఈవో స్థాయుల్లో మహిళల వాటా కేవలం 6 శాతం మాత్రమే. ఇక వేతనాల్లోనూ మహిళలపట్ల వివక్ష కనిపిస్తున్నట్లు తేలింది. ఆతిథ్య, పర్యాటక రంగాల్లో పురుషుల కంటే మహిళలు సగటున 14.7 శాతం తక్కువగా వేతనం అందుకుంటున్నారట. అయితే, గతేడాదితో పోలిస్తే వారి జీతభత్యాలు 4.2 శాతం నుంచి 5.2 శాతానికి పెరగడం గమనార్హం. వృత్తిపరమైన విభజన వల్లే ప్రమోషన్లు, జీతాల్లో అసమానత ఉన్నదని పరిశోధకులు అంటున్నారు. జీతాలు అందించే నాయకత్వ పదవుల్లో పురుషులే ఎక్కువగా ఉంటున్నారు. తక్కువ వేతన ఉద్యోగాలైన ఫ్రంట్‌లైన్ సర్వీసుల్లో మహిళల ప్రాతినిధ్యం ఎక్కువ. దాంతోపాటు ఇంటి సంరక్షణ బాధ్యతల కారణంగా మహిళలు పార్ట్‌టైమ్, సౌకర్యవంతమైన పాత్రల్లోనే పనిచేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇది వారి ప్రమోషన్‌లు, వేతన పెరుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని సర్వేకారులు వెల్లడించారు. అయితే, ఆతిథ్యరంగంలో మహిళలకు మార్గదర్శకత్వం కల్పించడంతోపాటు, ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌లను విస్తరించడం వల్ల వాళ్లు మరింతగా రాణించే అవకాశం ఉన్నదని చెబుతున్నారు.

# ఆడవాళ్లకే అధికం!

**గుసగుసలు** పెట్టడంలో ఆడవాళ్లదే పైచేయి. పక్కవారికి ఏమాత్రం వినిపించకుండా.. వీళ్ల మాటలు సాగుతుంటాయి. ఎంత చిన్నగా మాట్లాడినా.. తోటి మహిళకు స్పష్టంగా వినిపిస్తాయి. మహిళల వినికిడి శక్తి ఎక్కువగా ఉండటమే దీనికి కారణమని తాజా పరిశోధన ఒకటి వెల్లడించింది. ఆడవాళ్లతో పోలిస్తే.. పురుషుల వినికిడి శక్తి తక్కువగా ఉంటుందని సదరు సర్వే తేల్చింది. ఇందుకు సంబంధించిన జీవసంబంధమైన వ్యత్యాసాన్ని.. ఈ అధ్యయనం హైలైట్ చేస్తున్నది. సైంటిఫిక్ రిపోర్ట్స్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం.. ఏ శబ్దాన్నయినా పురుషులు - మహిళలు భిన్నంగా వింటారట. వయసు, స్థానికతతో సంబంధం లేకుండా.. పురుషుల కంటే మహిళలే మెరుగైన వినికిడి సామర్థ్యాన్ని కలిగి ఉంటారట. మహిళలు సగటున రెండు డెసిబెల్స్ స్పష్టమైన తేడాతో మెరుగైన వినికిడి శక్తిని కలిగి ఉంటారని పరిశోధకులు తేల్చారు. ఇందుకోసం ఐదు దేశాలలోని 13 విభిన్న సమూహాల నుంచి 448 మంది వినికిడి సామర్థ్యాన్ని పరిశీలించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు మొదలుకొని కొండ ప్రాంతాల వారి వరకూ.. అపారమైన వైవిధ్యం కలిగిన ప్రాంతాల వారిని ఇందుకోసం ఎంచుకున్నారు. మహిళల లోపలి చెవి నిర్మాణంలో సూక్ష్మమైన తేడాలు ఉంటాయని, హార్మోన్ల తేడాలు కూడా ఈ వ్యత్యాసానికి కారణమని పరిశోధకులు కనుగొన్నారు. వయసుతోపాటు వినికిడి సామర్థ్యాలు తగ్గినప్పటికీ.. ఆడవాళ్లకు వారి వయసులోని పురుషుల కంటే మెరుగైన వినికిడి శక్తి ఉన్నట్లు వెల్లడించారు. పర్యావరణం పైనా దృష్టి పెట్టిన ఈ అధ్యయనం.. నివాస ప్రాంతాలను బట్టికూడా వినికిడి శక్తి మారుతుందని కనుగొన్నది. ఆండీస్ వంటి ఎత్తయిన పర్వత ప్రదేశాలలో నివసించేవారికి ఆక్సిజన్ స్థాయులు తక్కువగా అందుతాయి. కాబట్టి, వీళ్ల వినికిడి శక్తి తక్కువగా ఉంటుందట. అదే సమయంలో ఉష్ణమండల అడవులలో నివసించే వారు మెరుగైన వినికిడి శక్తి కలిగి ఉంటారని తేల్చారు. ఇక నగరవాసులు శబ్ద కాలుష్యానికి ఎక్కువగా గురవుతుంటారు. దాంతో వారి వినికిడి సామర్థ్యం తక్కువగా ఉంటుందని పరిశోధకులు వెల్లడించారు.

